సాక్షి
ఖమ్మం

బుధవారం । 2 । ఏప్రిల్ । 2025



వసూళ్లలో సత్తుపల్లి భేష్!

తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను వసూళ్లకు సంబంధించి సత్తుపల్లి మున్సిపాలిటీ అగ్రస్థానాన నిలినిచింది. 8లో



...కెపాసిటర్ బ్యాంక్‌లు

విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల నియంత్రణ, లోఓల్టేజీని అరికట్టేందుకు సబ్‌స్టేషన్లలో కెపాసిటర్ బ్యాంక్‌లను ఏర్పాటుచేస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
37° / 23°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం సమయాన వడగాలులు వీచే అవకాశముంది.

న్యూస్‌రీల్

రాజీవ్ యువవికాసం దరఖాస్తు గడువు పొడిగింపు

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంసహకారనగర్: యువతకు స్వయం ఉపాధి కల్పించేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు గడువును ఈనెల 14 వరకు పొడిగించిందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ యువతకు సంబంధిత కార్పొరేషన్ల ద్వారా 100 శాతం సబ్సిడీపై రూ.50 వేల యూనిట్, 90 శాతం సబ్సిడీపై రూ.లక్ష యూనిట్, 80 శాతం సబ్సిడీతో రూ.2 లక్షల యూనిట్, 70 శాతం సబ్సిడీతో రూ.4 లక్షల విలువైన ఏర్పాటుకు ఈ పథకం ద్వారా చేయూత అందుతుందని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోనైతే వార్షిక ఆదాయ పరిమితి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల లోపు ఆదాయం కలిగిన వారు అర్హులని, తెల్ల రేషన్ కార్డులో దరఖాస్తుదారుల పేరు లేకపోతే ఆదాయ సర్టిఫికెట్ సమర్పించొచ్చని తెలిపారు. వ్యవసాయేతర పథకాలకు 21 – 55ఏళ్లు, వ్యవసాయ అనుబంధ రంగాల యూనిట్లకు 60ఏళ్ల వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 14లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన వారికి యూనిట్ గ్రౌండింగ్, నిర్వహణలో శిక్షణ కూడా కలెక్టర్ ఓ ప్రకటనలో వివరించారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలు

ఖమ్మంసహకారనగర్: దేశవ్యాప్తంగా ఎన్‌టీఏ ఆధ్వర్యాన నిర్వహించే జేఈఈ మెయిన్స్, బీఆర్క్ రెండో విడత పరీక్షలకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈమేరకు బొమ్మ ఇంజనీరింగ్ కళాశాల, శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల, ఎస్‌బీఐటీ, విజయ ఇంజనీరింగ్ కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పరీక్షల జిల్లా కోఆర్డినేటర్ పార్వతీరెడ్డి వెల్లడించారు. కాగా, 2, 3, 4, 7, 8, 9తేదీల్లో జేఈఈ మెయిన్స్, బీఆర్క్ రెండో విడత పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఉదయం 9నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు షిఫ్టులుగా పరీక్షలు ఉంటాయని, ఉదయం 8–30కు, మధ్యాహ్నం 2–30గంటలకు కేంద్రాలు మూసివేస్తామని వెల్లడించారు. విద్యార్థులు సాధారణ దుస్తులు ధరించాలని రావాలని సూచించిన ఆమె, కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయడమే కాక పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



మండపారాధన చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం మూడో రోజుకు చేరాయి. ఈసందర్భంగా స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించిన అర్చకులు మండపారాధన, మన్యు సూక్త హోమంతో పాటు సామూహిక సౌభాగ్యలక్ష్మి వ్రతం జరిపించారు. ఆతర్వాత ఉత్సవ మూర్తులను అశ్వవాహనంపై గిరి ప్రదక్షిణ చేయించాక భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్ రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఆలయ పర్యవేక్షకులు కె.విజయకుమారి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, ఉప ప్రధాన అర్చకులు ఉప్పల మురళీమోహన్‌శర్మ, అర్చకులు రాజీవ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.


'రాజీవ్ యువవికాసం'ను సద్వినియోగం చేసుకోవాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

మధిర: అర్హులైన యువతీ, యువకులు స్వయం సమృద్ధి కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. మధిర మండలం దెందుకూరులో మంగళవారం పర్యటించిన ఆమె పథకానికి దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడారు. దరఖాస్తు గడువును ఈనెల14 వరకు పొడిగించినందున, అర్హులైన నిరుద్యోగ యువత ముందుకు రావాలని తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు లేకపోతే ఆదాయ ధ్రువీకరణ పత్రం ఆధారంగా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఎంపికైన వారికి యూనిట్ ఎంపిక, వ్యాపార నిర్వహణలో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ నవీన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రామా కేర్ ప్రాణం బేఫికర్



హైవేలపై సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం

- క్షతగాత్రులకు సత్వరమే వైద్యం అందించే ప్రయత్నం
- తద్వారా మృతుల సంఖ్య తగ్గించొచ్చని భావన
- అంతకుముందే అందుబాటులోకి రానున్న క్రిటికల్ కేర్ యూనిట్

జిల్లాలో ప్రమాదాల వివరాలు...

ఏడాది	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2024	785	281	629మంది
2025	50	33	100

మార్చి 31వరకు

ఖమ్మంవైద్యవిభాగం: ఉమ్మడి ఖమ్మం జిల్లా మీదుగా వందలాది కి.మీ. మేర జాతీయ రహదారులు వెళ్తున్నాయి. త్వరలోనే ఖమ్మం–దేవరపల్లి హైవే కూడా అందుబాటులోకి రానుంది. అయితే, నాణ్యమైన రహదారులు ఉండడంతో వాహనాలు రయ్‌రయ్ మంటూ సాగుతుండగా ప్రమాదాలు సైతం అదే స్థాయిలో జరుగుతున్నాయి. దీంతో జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు అత్యవసరంగా చికిత్స అందించేలా ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇలాంటి సెంటర్లు ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు లేకపోగా.. క్షతగాత్రుల చికిత్సకు ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పెద్దదిక్కుగా నిలుస్తోంది. భద్రాద్రి కొత్తగూడెంలో కూడా అత్యవసర చికిత్స అందక బాధితులను ఖమ్మంకే తరలిస్తున్నారు. ఇక్క డా పరిస్థితి చక్కబడకపోతే హైదరాబాద్ పంపిస్తుండడం.. ఇంతలోనే విలువైన సమయం గడిచిపోయి బాధితుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది.

35 కి.మీ.కు ఒకటి..

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండగా.. మృతుల కుటుంబాలకు తీరని వేదన మిగులుతోంది. ఏదైనా రహదారిపై ప్రమాదం జరిగినప్పుడు తొలి అర గంట, గంటలో సరైన చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుంది. దీనిని వైద్యులు గోల్డెన్ అవర్‌గా పరిగణిస్తారు. ఈనేపథ్యాన క్షతగాత్రులకు సత్వరమే వైద్యం అందేలా రాష్ట్ర వ్యాప్తంగా 90 ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 35 కి.మీ. దూరానికి ఒకటి ఏర్పాటుచేయనుండగా.. భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెం, సత్తుపల్లి, తల్లాడ, మధిర, పాలేరు వంటి ప్రాంతాల్లో జాతీయ రహదారులు వెళ్తుండడంతో ఉమ్మడి జిల్లాలో రెండు నుంచి మూడు సెంటర్లు ఏర్పాటవుతాయని భావిస్తున్నారు. ఈ సెంటర్ల నిర్వహణ బాధ్యతలను వైద్య విధాన పరిషత్, వైద్య ఆరోగ్య శాఖ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ విభాగాలకు అప్పగించే అవకాశం ఉంది.

పెద్దాస్పత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్

క్షతగాత్రులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ట్రామాకేర్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏళ్లుగా ప్రతిపాదనలు పంపిస్తున్నా ఫలితం కానరాలేదు. తాజాగా ప్రభుత్వం ఈ అంశంపై నిర్ణయం తీసుకోవడమే కాక ఎక్కడెక్కడ ఏర్పాటుచేయాలనే అంశంపై అధికారులు దృష్టి సారించారు. ఈ కసరత్తు పూర్తయి నిర్మాణాలు చేపట్టేలోగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్ అందుబాటులోకి రానుంది. తద్వారా ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి మెరుగైన చికిత్స అందుతుంది. ఖమ్మం ఆస్పత్రి ఆవరణలో క్రిటికల్ కేర్ యూనిట్‌ను గత ప్రభుత్వం మంజూరు చేయగా, కేంద్రప్రభుత్వం భవన నిర్మాణానికి రూ.21 కోట్లు కేటాయించింది. టీఎస్‌ఎమ్ఎస్ఐడీసీ ఆధ్వర్యాన జీ ప్లస్ 3 భవన నిర్మాణాన్ని ఆరు నెలల క్రితం ప్రారంభించడంతో మరో నెలల్లో పూర్తయ్యే అవకాశముంది. క్రిటికల్ కేర్ యూనిట్ అందుబాటులోకి వస్తే ట్రామా కేర్ భవనాలు ఏర్పాటయ్యేవరకు జిల్లాలో ప్రమాద బాధితులకు అత్యవసర చికిత్స అందుతుంది.



పెద్దాస్పత్రిలో సిద్ధమవుతున్న క్రిటికల్ కేర్ భవనం

ఆరు నెలల్లో క్రిటికల్ కేర్ యూనిట్



పెద్దాస్పత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్ భవనం ఆరు నెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశముంది. గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి మెరుగైన చికిత్స అందించొచ్చు. ఇక రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర, జాతీయ రహదారులపై 90 ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. ఈ జాబితాలో ఉమ్మడి జిల్లాకు స్థానం దక్కనున్నట్లు తెలుస్తున్నా.. ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ నిర్ణయం. అయితే, వీటి కన్నా ముందే పెద్దాస్పత్రిలో క్రిటికల్ కేర్ అందుబాటులోకి వస్తుంది.

– ఎస్.రాజేశ్వరరావు, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్

సన్నాల సంబురం

- రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు
- సత్తుపల్లి నియోజకవర్గంలో ఒకే మండలంలో ప్రారంభం



ఖమ్మంలో బియ్యం అందజేస్తున్న మేయర్ నీరజ, డీఎస్‌ఓ చందన్‌కుమార్



అనంతనగర్‌లో సన్నబియ్యంతో వండిన అన్నాన్ని పరిశీలిస్తున్న మహిళలు

ఖమ్మంసహకారనగర్: రేషన్‌షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ మంగళవారం ప్రారంభమైంది. ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తామన్న ప్రభుత్వ హామీ మేరకు రెండు, మూడు రోజులుగా షాపులకు చేరవేస్తున్నారు. ఈక్రమాన మంగళవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఏన్కూరు మండలం తిమ్మారావుపేట, సింగరేణి మండలం భాగ్యనగర్ తండాల్లో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, అలాగే పెనుబల్లి మండలం ముత్తగూడెంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి లాంఛనంగా ప్రారంభించగా.. ఖమ్మం అర్బన్ మండలం చర్చి కాంపౌండ్‌లోని షాప్‌లో మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీటీ విజయ్‌కుమార్, ఆర్ఐ వహీద్ తదితరులు పాల్గొన్నారు. మధిర, పాలేరు నియోజకవర్గాల్లోని మండలాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా.. సత్తుపల్లిలో మాత్రం పెనుబల్లి మండలంలోనే ప్రారంభమైంది. మిగతా మండలాల్లో బుధవారం నుంచి పంపిణీ చేయాలని డీలర్లకు అధికారులు సూచించినట్లు తెలుస్తుండగా.. విషయం తెలియని లబ్ధిదారులు షాప్‌ల చుట్టూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రదక్షిణలు చేశారు.

షాపుల్లో డీఎస్‌ఓ తనిఖీ

ఖమ్మంరూరల్: సన్నబియ్యం పంపిణీని ఖమ్మం రూరల్ మండలంలోని పలు షాపుల్లో డీఎస్‌ఓ చందన్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. పెదతండాలోని రేషన్ షాప్ తనిఖీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్నబియ్యాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని సూచించారు. డీలర్లు సకాలంలో షాపులు తెరవాలని తెలిపారు. కాగా, గతంలో మాదిరిగానే జిల్లాలోని ఏ షాప్‌లోనైనా పోర్టబిలిటీ విధానంలో బియ్యం తీసుకోవచ్చని డీఎస్‌ఓ వెల్లడించారు.

మహిళల్లో ఆనందం



సన్నబియ్యంతో వండిన భోజనం

నేలకొండపల్లి: రేషన్ షాప్‌ల ద్వారా మంగళవారం నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తారనే సమాచారంతో లబ్ధిదారులు ఉదయాన్నే షాపుల వద్దకు చేరుకున్నారు. వీరిలో మహిళలే ఎక్కువగా ఉండగా బియ్యం తీసుకున్నాక నాణ్యతను పరిశీలించడం కనిపించింది. అంతేకాక పలువురు తమ ఇళ్లలో అప్పటికప్పుడు కొద్దిపాటి బియ్యంతో అన్నం వండి ఎలా అయిందోనని పరిశీలించడమేకాక ఇరుగుపొరుగు వారితో చర్చించారు. ఇన్నాళ్లు రేషన్‌షాపుల్లో దొడ్డుబియ్యం ఇస్తుండగా లబ్ధిదారులు ఎక్కువ మంది ఆసక్తి కనబర్చలేదు. ఇప్పుడు సన్న బియ్యం పంపిణీ మొదలవడంతో అందరూ తీసుకునే అవకాశముందని డీలర్లు భావిస్తున్నారు.

మాలాంటి వారికి మేలు



సన్నబియ్యం తీసుకోవడం ఆనందంగా అనిపించింది. రేషన్ షాపుల్లో సన్నాలు అందిస్తూ పేదలకు ప్రభుత్వం చాలా మేలు చేస్తోంది. ఇంట్లో సన్నబియ్యం ఉంటే మాలాంటి కుటుంబాలకు ఎంతో ధైర్యం. – కణతాల లీల, కోరట్లగూడెం

ఇకపై రేషన్ బియ్యమే..



ఇప్పటివరకు దొడ్డు బియ్యం కావడంతో చాలా మంది షాప్‌ల్లో తీసుకోకపోయేవారు. ప్రస్తుతం సన్నబియ్యం కావడంతో అందరూ రేషన్ బియ్యమే తింటారు. ఈ పథకంతో పేదలకు ఎంతో మేలు జరగనుంది.

– బచ్చలకూరి వెంకట్రావమ్మ, నేలకొండపల్లి

చాలా ఆనందంగా ఉంది...



రేషన్‌షాప్‌లో ప్రతీనెలా దొడ్డు బియ్యం వచ్చేవి. అవి బాగుండక ఎక్కువ ధర పెట్టి సన్న బియ్యం కొనేవాళ్లం. ఇప్పుడు సన్నబియ్యం ఇస్తుండడంతో మా బాధలు తప్పడం ఆనందంగా అనిపిస్తోంది.

– మార్తి సావిత్రి, కోరట్లగూడెం

భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలి

- ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టండి
- అధికారులకు దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశం



ఏర్పాట్లపై చర్చిస్తున్న కమిషనర్, పక్కన పీఓ, ఈఓ

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలకు వచ్చే భక్తులు ఎండల కారణంగా ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ అధికారులకు సూచించారు. మిథిలా స్టేడియం, ఆలయ పరిసరాలను మంగళవారం ఆయన పరిశీలించారు. సెక్టార్ల విభజన, సీఎం, వీఐపీ, ఇతర సెక్టార్లలో ఏర్పాట్ల గురించి అధికారులు మ్యాప్ ద్వారా వివరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఎండల నేపథ్యంలో భక్తులు ఇబ్బంది పడకుండా తాగునీరు, మజ్జిగ, గాలి వీచేలా ఏర్పాట్లు చేయడంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. భక్తులు కల్యాణంతో పాటు ఆ తర్వాత మూలమూర్తులను దర్శించుకునేలా చూడాలని, భక్తులందరికీ తలంబ్రాలు, ప్రసాదం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఐటీడీఏ పీఓ బి.రాహుల్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, దేవస్థానం ఈఓ రమాదేవి, ఈఈ రవీందర్, ఆర్‌డీఓ దామోదర్‌రావు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి

- గ్రామ పాలన అధికారులు, భూభారతి చట్టంతో పరిష్కారం
- రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి



రెవెన్యూ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామాల్లో రైతులు, ప్రజలు భూసమస్యల పరిష్కారం కోసం ఎవరి వద్దకు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొన్నందున ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి వెల్లడించారు. ఖమ్మంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొస్తున్న భూభారతి చట్టంతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈక్రమంలోనే 10,954 గ్రామ పాలన అధికారుల(జీపీఓ) పోస్టులు మంజూరు చేసిందని తెలిపారు. అంతేకాక పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలను తిరిగి మాతృసంస్థలోకి తీసుకురావడానికి సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని చెప్పారు. అలాగే, తొలిసారి 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టుల మంజూరు, తహసీల్దార్లు, ఆర్డీఓలు, అదనపు కలెక్టర్లు కోల్పోయిన అధికారాలు భూభారతి చట్టంతో పునరుద్ధరణ జరిగాయని తెలిపారు. గతంలో జీఓ 317తో దంపతులైన ఉద్యోగులు చిన్నాభిన్నం కాగా, జేఏసీ ఉద్యమ ఫలితంగా స్పౌజ్, మెడికల్, తదితర కోణాల్లో బదిలీలను చేపట్టిందని చెప్పారు. గ్రామ పాలన అధికారుల రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్ర రావు మాట్లాడుతూ గత చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వీఆర్వోలు, వీఆర్ఏలను అన్యాయంగా అర్ధరాత్రి లాటరీ పద్ధతిలో వివిధ శాఖలకు కేటాయించిన గత ప్రభుత్వం ఆత్మాభిమానాన్ని దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జేఏసీ సారథ్యాన వీఆర్వోలకు పూర్వవైభవం వచ్చిందని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉద్యోగులు, సంఘాల నాయకులు డీఎస్.వెంకన్న, మంగీలాల్, బుచ్చయ్య, కోట రవికుమార్, పాక రమేష్, ఫూల్‌సింగ్ చౌహాన్, శ్రీనివాస్, శంకర్‌రావు, ప్రేమ్‌కుమార్, వజ్జ రామారావు, వాంకుడోత్ వెంకన్న, పాండు నాయక్, సలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

■ రిటైర్డ్ ఆర్డీఓ పొట్టపెంజర రాజారావు ఇటీవల మృతి చెందగా ఆయన చిత్రపటం వద్ద లచ్చిరెడ్డి నివాళులర్పించారు. అలాగే, ఆయన కుటుంబీకులను పరామర్శించాక మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగిగా నిజాయితీగా సేవలందించడమేకాక రెవెన్యూ పత్రిక నిర్వహించడంలో రాజారావు కీలకంగా వ్యవహరించారని కొనియాడారు.

ఏదులాపురం అభివృద్ధికి రూ.90.50లక్షలు

ఖమ్మంరూరల్: కొత్తగా ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో రూ.90.50లక్షల నిధులు విడుదలయ్యాయి. ఇందులో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.50లక్షలు, డివిజన్లలో డివైడర్ల మధ్య మొక్కలు నాటడానికి రూ.15.50లక్షలు కేటాయించనున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, వీధుల్లో ఎల్ఈడీ లైట్ల ఏర్పాటుకు రూ.25లక్షలు వెచ్చించనున్నారు. పాలేరు నియోజకవర్గంలో ఏదులాపురం మున్సిపాలిటీ కొత్తగా ఏర్పడిన నేపథ్యాన ఇతర మున్సిపాలిటీలకు దీటుగా తీర్చిదిద్దే క్రమాన మంత్రి పొంగులేటి చొరవ తీసుకుని 'సుడా' నుంచి ఈ నిధులు మంజూరు చేయించారు.

శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయండి..

రాజ్యసభలో ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: సహకార రంగంలో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి కేంద్రప్రభుత్వం రూ.1,122కోట్లు కేటాయించడంపై రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు రాజ్యసభలో మంగళవారం ఆయన మాట్లాడారు. త్రిభువన్ సహకార యూనివర్సిటీ ఏర్పాటుకు రూ.500 కోట్లు కేటాయించడమే కాక 284 కేంద్రాల ద్వారా 8లక్షల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించడం, సహకార సంఘాల ఆధునికీకరణలో భాగంగా డిజిటలైజేషన్, స్టార్టప్‌లకు ప్రోత్సహించేలా రూ.600 కోట్లు కేటాయించడం ఆశాజనకంగా ఉంటుందన్నారు. అయితే, ఇందులో తెలంగాణ రాష్ట్రానికి తగిన ప్రాధాన్యత లభించలేదని ఎంపీ వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో మాత్రమే శిక్షణ కేంద్రం ఉన్నందున ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాద్‌లోనూ ఏర్పాటుచేయాలని కోరారు. అలాగే, తెలంగాణలో మిల్లెట్స్ పరిశోధనకు విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పాలని కేంద్రానికి ఎంపీ విజ్ఞప్తి చేశారు.

హెచ్‌సీయూ భూములను కాపాడాలి

హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గచ్చిబౌలిలోని సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని వేలం వేసేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రయత్నిస్తోందని రాజ్యసభలో మాట్లాడుతూ ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భూముల్లో చెరువులతో పాటు అరుదైన వృక్ష సంపద, జీవ వైవిధ్యం ఉన్నందున కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

టోల్‌గేట్ చార్జీల సవరణ

స్వల్పంగా పెరిగిన ఫీజులు

కూసుమంచి: ఎన్‌హెచ్ఏఐ(జాతీయ రహదారుల ప్రాధికారిత సంస్థ) ఆధీనంలోని టోల్‌గేట్ల ఫీజులను సోమవారం అర్ధరాత్రి నుండి సవరించారు. ఇందులో భాగంగా ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై నాయకన్‌గూడెం సమీపాన ఉన్న సింగరేణిపల్లి టోల్ గేట్ ఫీజులు కూడా స్వల్పంగా పెరిగాయి.



నాయకన్‌గూడెంలోని సింగరేణిపల్లి టోల్ ప్లాజా

పెరిగిన ఫీజుల వివరాలు

వాహనం	సింగిల్ జర్నీ		రెండు వైపులా	
	పాత ఫీజు	పెంచిన ఫీజు	పాత ఫీజు	పెంచిన ఫీజు
కారు, జీపు, వ్యాన్, ఎల్ఎంవీ వాహనాలు	రూ.120	రూ.125	రూ.180	రూ.185
ఎల్‌సీవీ, మినీ బస్సులు	రూ.195	రూ.200	రూ.290	రూ.300
బస్సు, ట్రక్కులు	రూ.405	రూ.420	రూ.610	రూ.630

ఇవేకాక హెవీ వాహనాలు, డిస్ట్రిక్ కమర్షియల్ వాహనాలు, నాన్ ఫాస్టాగ్ వాహనాలకు సైతం గతంలో ఉన్న ఫీజును వాహనాల ఆధారంగా రూ.60వరకు పెంచారు.

డీసీసీబీ జీఎంలపై సస్పెన్షన్ ఎత్తివేత

షరతులతో పునర్‌నియామకం, విచారణ కొనసాగింపు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో పనిచేస్తుండగా వచ్చిన ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన ఇద్దరు జనరల్ మేనేజర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర కోఆపరేటివ్ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. రుణమాఫీ, రైతుబీమా ప్రీమియం, ఉద్యోగుల బదిలీలు, ఇంక్రిమెంట్లు, ప్రోత్సాహకాలు తదితర అంశాల్లో అక్రమాలకు పాల్పడ్డారని, పాలకవర్గంతో ప్రమేయం లేకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని బ్యాంకు డైరెక్టర్లు రాష్ట్ర సహకార బ్యాంకు ఎండీ, సహకార రిజిస్ట్రార్, ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో రుణమాఫీ అంశంపై సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్‌ను, రైతు బీమా ప్రీమియంపై జనరల్ మేనేజర్ ఏ. పద్మావతి, ఉద్యోగుల బదిలీలు, ఇంక్రిమెంట్లు, ప్రోత్సాహకాల విషయంలో మరో జనరల్ మేనేజర్ కె.నర్మదను గత ఆగస్టు, సెప్టెంబర్ ల్లో సస్పెండ్ చేశారు. ఈనేపథ్యాన విచారణ జరుగుతుండగా, జీఎంలు పద్మావతి, నర్మదను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర సహకార రిజిస్ట్రార్ టస్కాబ్ ఎండీని ఆదేశించారు. ఇందులో పద్మావతిని ఖమ్మం డీసీసీబీలో కాకుండా ఇతర చోట నియమించాలని, నర్మద ఖమ్మం డీసీసీబీలో పనిచేసిన సమయాన ఆరోపణలు ఎదుర్కొంటూ నల్లగొండ జిల్లాకు బదిలీ అయ్యాక సస్పెండ్ కావడంతో అక్కడే జనరల్ మేనేజర్‌గా నియామకానికి అవకాశం ఇచ్చారు. కాగా, ఖమ్మం డీసీసీబీ పరిధిలో 1.69 లక్షల మంది రైతులకు రూ.892 కోట్ల పంట రుణాలు మాఫీ కావాల్సి ఉండగా, కేవలం 68వేల మందికే రూ.274 కోట్లు మాఫీ అయ్యాయి. దీంతో పాటు మరికొన్ని అంశాల్లో ఆరోపణలు ఎదుర్కొంటూ సస్పెన్షన్‌కు గురైన సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్ విషయంలో మాత్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

యథావిధిగా విచారణ

డీసీసీబీ జీఎంలపై సస్పెన్షన్లను ఎత్తివేసినప్పటికీ అక్రమాలపై విచారణ మాత్రం కొనసాగించాలని నిర్ణయించారు. దీంతో నర్మద, పద్మావతి రుణమాఫీ, బీమా ప్రీమియం, బదిలీలు, ఇంక్రిమెంట్లు, ప్రోత్సాహకాల అంశంపై యథావిధిగా విచారణ చేపట్టనున్నారు.

క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన బార్ అసోసియేషన్



కార్యవర్గాన్ని అభినందిస్తున్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్: ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం మంగళవారం బాధ్యతలు స్వీకరించింది. అధ్యక్షుడిగా తొండపు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షురాలిగా మోత్కూరి విజయశాంత, కార్యదర్శిగా గద్దల దిలీప్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఎం.నవీన్ కుమార్‌తో పాటు ఎస్.రాంబాబు, కే.వీ.వీ.లక్ష్మి, పి.నర్సింహారావు, పి.ఇందిర ప్రమాణం చేశారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వరరావు, దిలీప్‌కుమార్ మాట్లాడుతూ కోర్టు ప్రాంగణంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడమే కాక, న్యాయవాద సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, బార్ - బెంచ్ మధ్య మంచి సంబంధాలు కొనసాగిస్తామని వెల్లడించారు.

హెచ్‌సీయూ భూముల స్వాధీనం నిలిపివేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: దశాబ్దాలుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆధీనంలో ఉన్న భూముల స్వాధీనాన్ని నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనేక రకాల వృక్షాలు, జంతువులతో పర్యావరణానికి నిలయంగా ఉన్న 400 ఎకరాల భూములను అమ్మేలా రాష్ట్రప్రభుత్వం స్వాధీనానికి యత్నించడం సరికాదని పేర్కొన్నారు. అంతేకాక భూములు కాపాడేందుకు నిరసన తెలుపుతున్న విద్యార్థులపై దౌర్జన్యం చేయడం, లాఠీచార్జ్ చేసి కేసులు పెట్టడం నిరంకుశత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. భూములను యూనివర్సిటీ ఆధీనంలో ఉంచడమే కాక అక్రమ అరెస్టులు ఆపాలని రంగారావు డిమాండ్ చేశారు.

బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విజయ్‌సారథి



విజయ్‌సారథి

ఖమ్మం స్పోర్ట్స్: బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఏసీపీ విజయ్ సారథికి కార్యవర్గంలో స్థానం దక్కింది. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా ఆయన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. జాతీయస్థాయిలో గుర్తింపు కలిగిన క్రీడాకారుడైన ఆయన పోలీస్ శాఖలో ఏసీపీగా కొనసాగుతున్నారు.

ఇసుక లారీలు సీజ్

తల్లాడ: అనుమతి లేకుండా ఏపీలోని నంది గామ నుంచి తల్లాడ మండలం మిట్టపల్లి వైపు ఇసుక తీసుకొస్తున్న రెండు లారీలను పోలీసులు సీజ్ చేశారు. సోమవారం అర్ధరాత్రి సీజ్ చేయగా, మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొండల్‌రావు తెలిపారు.

చోరీ కేసుల్లో ఒకరి అరెస్ట్

ఖమ్మంక్రైం: జల్సాలకు అలవాటు పడి ఇళ్లలో, బైక్‌లు చోరీ చేస్తున్న వ్యక్తిని ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం.. భద్రాచలానికి చెందిన కోడి శేఖర్ అలియాస్ జంపన్న మరో వ్యక్తితో కలిసి చోరీలకు పాల్పడుతున్నాడు. దీంతో నిఘా పెట్టిన పోలీసులకు పంచాక్షరి కాలనీలో ఉన్నట్లు సమాచారం అందగా శేఖర్‌ను అరెస్ట్ చేసి నాలుగు బైకులు, 10 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని, మరో నిందితుడు పారిపోయాడని సీఐ తెలిపారు. కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు హరికృష్ణ, బోరయ్యను సీపీ సునీల్‌దత్, ఏసీపీ రమణమూర్తి అభినందించారు.

కానిస్టేబుల్ ఆత్మహత్య



బండి కృష్ణ (ఫైల్)

ఖమ్మంక్రైం: మూడు రోజులుగా సెలవులో ఉన్న ఓ కానిస్టేబుల్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఖమ్మంలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు... నేలకొండపల్లిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బండి కృష్ణ(38) మూడు రోజులుగా సెలవులో ఉన్నాడు. ఖమ్మం ముస్తఫానగర్‌లోని ఇంటి నుంచి మంగళవారం సాయంత్రం బయటకు వెళ్లిన తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లేక సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా ఆరా తీస్తూ పిల్లిగుట్టల వద్దకు వెళ్లారు. అప్పటికే ఆయన గూడ్స్ రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే పోలీసులు వెల్లడించారు. దీంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, కూసుమంచి సీఐ సంజీవ్, నేలకొండపల్లి ఎస్ఐ సంతోష్ మృతదేహాన్ని సందర్శించగా, కృష్ణ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

ఆస్తిపన్ను వసూళ్లలో సత్తుపల్లి భేష్

- ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో ముందంజ
- ఆ తర్వాత స్థానంలో ఇల్లెందు
- కేవలం 52శాతంతో జాబితాలో చివరన వైరా



సత్తుపల్లి మున్సిపాలిటీ కార్యాలయం



పన్నులు వసూలు చేస్తున్న కమిషనర్, ఉద్యోగులు (ఫైల్)

మున్సిపాలిటీ	ఆస్తి పన్ను వసూళ్లు (శాతం)
సత్తుపల్లి	86.76
ఇల్లెందు	82.40
మధిర	75
కొత్తగూడెం	73.90
పాల్వంచ	65.66
మణుగూరు	61.98
వైరా	52.46

సత్తుపల్లిటౌన్: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను వసూళ్ల గడువు సోమవారంతో ముగిసింది. ఈనేపథ్యాన ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో పరిశీలిస్తే సత్తుపల్లి ముందంజలో నిలిచింది. చివరిరోజు వరకు మున్సిపాలిటీ మేనేజర్ సహా రెవెన్యూ యంత్రాంగమంతా పన్ను వసూళ్లలో నిమగ్నం కావడం.. ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఆరు రోజుల ముందు ప్రభుత్వం వన్ టైం సెటిల్‌మెంట్ పథకం ద్వారా పన్ను వడ్డీపై 90 శాతం రాయితీని ప్రకటించడంతో బకాయిదారులకు మెరుగైన వసూళ్లు నమోదయ్యాయి. అంతేకాక ఆస్తి పన్ను చెల్లించకుండా మొండికేసిన వారికి జప్తు నోటీసులు జారీ చేయడం.. నల్లా కనెక్షన్లు తొలగిస్తామన్న హెచ్చరికలతో చాలా మంది మొండి బకాయిదారులు సైతం పన్ను చెల్లించారు.

వసూళ్లు ఇలా...

ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో పరిశీలిస్తే సత్తుపల్లిలో రూ.4.91 కోట్లకు రూ.4.26 కోట్లు, వైరాలో రూ.4.06 కోట్లకు రూ.2.13 కోట్లు, మధిరలో రూ.2.56 కోట్లకు రూ.1.96 కోట్లు వసూలైంది. కొత్తగూడెం మున్సిపాలిటీలో రూ.7.93 కోట్లకు రూ.5.86 కోట్లు, మణుగూరులో రూ.2.42 కోట్లకు రూ.1.50 కోట్లు, పాల్వంచలో రూ.6.29 కోట్లకు రూ.4.13 కోట్లు, ఇల్లెందులో రూ.2.67 కోట్ల పన్ను డిమాండ్‌కు గాను రూ.2.20 కోట్లు ఆస్తి పన్ను వసూలు చేయగలిగారు.

గత ఏడాదితో పోలిస్తే మెరుగు

సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 85 శాతం పన్నులు వసూలయ్యాయి. అయితే, 2024–25లో 86.76 శాతం వసూలవడంతో గత ఏడాది కంటే మెరుగైంది. పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకునేలా నెల ముందు నుంచే స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ రోజువారి సమీక్షలు చేస్తూ.. మొండిబకాయిదారులతో మాట్లాడడంతో సత్ఫలితాలు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో 86.76 శాతంతో సత్తుపల్లి ముందంజలో నిలువగా.. వైరా మున్సిపాలిటీలో కేవలం 52.46 శాతమే వసూలు కాగా చివరి స్థానంలో నిలిచింది.

ముందస్తు ప్రణాళికతో...



ఆస్తిపన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ చేపట్టడంతో పాటు లక్ష్య సాధనకు సమిష్టిగా శ్రమించాం. ఫిబ్రవరి నుంచి ఇంటింటికీ మా సిబ్బంది వెళ్లి పన్నులు చెల్లించాలని అవగాహన కల్పించాం. తొమ్మిది బృందాలతో ప్రతిరోజు సమీక్షలు చేస్తూ పన్నుల వసూళ్లను వేగవంతం చేశాం. వచ్చే ఏడాది నూరు శాతం పన్నుల వసూళ్లకు ఇప్పటి నుంచే ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతాం.

– కె.నర్సింహ, కమిషనర్, సత్తుపల్లి

సబ్‌స్టేషన్లలో కెపాసిటర్ బ్యాంక్‌లు

- తద్వారా ఓల్టేజీ హెచ్చుతగ్గులకు బ్రేక్
- విద్యుత్ పరికరాల మన్నికకు దోహదం



కెపాసిటర్ బ్యాంక్‌లు



ఖమ్మంలోని ఓ సబ్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన కెపాసిటర్ బ్యాంకు

ఖమ్మంవ్యవసాయం: ఎండలు ముదురుతుండడంతో విద్యుత్ వినియోగం నానాటికీ పెరుగుతోంది. ఈనేపథ్యాన నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం సబ్ స్టేషన్లు, ఫీడర్లలో కెపాసిటర్ బ్యాంక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఓల్టేజీ హెచ్చుతగ్గులను నియంత్రించి నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఈ కెపాసిటర్ బ్యాంకులు దోహదపడతాయని చెబుతున్నారు. ఈమేరకు అవసరమైన ప్రాంతాల్లో వీటిని అమర్చడంపై ఎన్పీడీసీఎల్ అధికారులు దృష్టి సారించారు.

కెపాసిటర్ బ్యాంక్‌లు, కెపాసిటర్లు

ఎన్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ పరిధిలో విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్ల సామర్థ్యం ఆధారంగా కెపాసిటర్ బ్యాంక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటివరకు 33/11 కేవీ సబ్‌స్టేషన్ల వద్ద 124 కెపాసిటర్ బ్యాంక్‌లు, విద్యుత్ లైన్లలో 60 కెపాసిటర్లను అమర్చారు. ఇవేకాక 11 కేవీ లైన్లలోనూ కెపాసిటర్ల ఏర్పాటుపై దృష్టి సారించారు. కాగా, కెపాసిటర్ బ్యాంక్‌ల ఏర్పాటుతో సబ్ స్టేషన్లు, లైన్ల నుంచి సరఫరాలో ఓవర్ లోడ్ సమస్య ఎదురుకాదని ఎదురుచెబుతున్నారు.

పరికరాలకు నష్టం ఉండదు...

కెపాసిటర్ బ్యాంక్‌ల ఏర్పాటు ద్వారా విద్యుత్ పరికరాల మన్నికకు దోహదపడుతుంది. వీటి ద్వారా సరఫరాలో లోపాలు, ఓల్టేజీ హెచ్చుతగ్గులను నియంత్రించే వీలు ఉండడంతో వ్యవసాయ పంపుసెట్లు, పారిశ్రామిక ఫీడర్లలో మోటార్లు కాలిపోయే అవకాశాలు గణనీయంగా తగ్గిపోతాయి. అలాగే, సాంకేతిక నష్టాలు సైతం తగ్గుతాయని చెబుతున్నారు. ఈనేపథ్యాన పరిశ్రమల్లోనూ కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటుకు ఎన్పీడీసీఎల్ ప్రోత్సహిస్తోంది.

కెపాసిటర్ బ్యాంక్‌ల ఏర్పాటుకు ప్రాధాన్యత



నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నాం. జిల్లాలో ఈ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటు వినియోగదారులకు ప్రయోజనమే కాక కెపాసిటర్ల ద్వారా విద్యుత్ ఓల్టేజీ హెచ్చుతగ్గులను నియంత్రించవచ్చు.

– ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ

నేడు 'జై బాపు.. జై భీం.. జై సంవిధాన్ యాత్ర'



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

ఖమ్మం వన్‌టౌన్: ఖమ్మంలో బుధవారం నిర్వహించనున్న 'జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్' యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల పార్టీ శ్రేణులకు పిలునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. బుధవారం ఉదయం 9గంటలకు ఖమ్మం 18వ డివిజన్ శ్రీరాం హిల్స్ నుంచి మొదలయ్యే యాత్రలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈసందర్భంగా అంబేద్కర్, మహాత్మాగాంధీతో పాటు స్వాతంత్ర సమర యోధుల త్యాగాలను ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈసమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మండడపు లక్ష్మి మనోహర్, పాకాలపాటి విజయ, నిర్మల శేషగిరి, ఆళ్ల నిరీష అంజిరెడ్డి, చామకూరి వెంకటనారాయణ, అలియా తదితరులు పాల్గొన్నారు.

జేవీఆర్ ఓసీ.. లక్ష్యసాధనలో మేటి



పీఓ ప్రహ్లాద్‌ను సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సత్తుపల్లిరూరల్: సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా 114 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడమే కాక 112.5 లక్షల టన్నుల రవాణాతో జేవీఆర్ ఓసీ మేటిగా నిలిచిందని పీఓ ప్రహ్లాద్ తెలిపారు. ఉత్పత్తి, రవాణాలో రికార్డు సృష్టించిన నేపథ్యాన పీఓతో పాటు మేనేజర్ రాజేశ్వరరావును ఐఎన్‌టీయూసీ నాయకులు భాస్కర్ నాగప్రకాష్, రామారావు మంగళవారం సన్మానించారు. అనంతరం వారు కాలనీలో కమ్యూనిటీ హాల్, వాకింగ్ ట్రాక్, ఆర్వో ప్లాంట్, సింగరేణి సూపర్ బజార్, పార్కు, ఓపెన్ జిమ్ ఏర్పాటు ఆవశ్యకతను వివరించగా పీఓ ప్రహ్లాద్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కోటి, ఐ.వీ.రెడ్డి, సురేష్, పాట్టి కిరణ్, సుదర్శన్, తిరుమలరావు, రాజేందర్, రాంచందర్, లాలు, మురళి, కిషన్‌రావు, లింగమూర్తి, చంద్రశేఖర్, సందీప్, శ్రీనివాస్, కనకరావు, రమేష్, మాలోతు అశోక్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులే స్ఫూర్తిప్రదాతలు

ప్రభుత్వ కొలువుల్లో ఇద్దరు కుమారులు



ఎస్ఐ హోదాలో తండ్రి వెంకటనరసయ్యకు సెల్యూట్ చేస్తున్న మనోహర్ గోపి



ఇటీవల పాలిటెక్నిక్ లెక్చరర్‌గా నియామక పత్రం అందుకుంటూ...

మధిర: మధిర మండలంలోని చిన్న గ్రామం నాగవరప్పాడు. ఆ గ్రామంలో రైతు కుటుంబానికి చెందిన ఇద్దరు సోదరులు తల్లిదండ్రులే స్ఫూర్తిగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఇంకొందరికి ఆదర్శంగా నిలిచారు. నాగవరప్పాడుకు చెందిన భీమనబోయిన వెంకట నరసయ్య – రాధ దంపతులకు ఇద్దరు కుమారులు. వెంకటనరసయ్య మూడు దశాబ్దాల క్రితం హోంగార్డ్‌గా పనిచేస్తూ భార్యతో కలిసి పొలం పనులు చూసుకునేవాడు. వ్యవసాయంపై దృష్టి పెట్టలేక హోంగార్డు ఉద్యోగం మానేశారు. అయితే, ఎస్ఐ తదితర అధికారులకు అందే విలువ, గౌరవ మర్యాదలను చూసిన ఆయన తన కుమారులిద్దరు పోలీస్ ఉద్యోగాలకు ఎంపికయ్యేలా స్ఫూర్తిగా నింపారు. దీంతో పెద్ద కుమారుడు గోపీకృష్ణ 2015లో బీటెక్ పూర్తి చేసి 2017లో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. ఇక చిన్న కుమారుడు మనోహర్ గోపి 10వ తరగతి వరకు గోసవీడు ప్రగతి స్కూల్‌లో, ఇంటర్ విజయవాడ శ్రీ చైతన్యలో, బీటెక్‌లో జేఎన్టీయూలో పూర్తిచేశాక కొన్నాళ్లు ప్రైవేట్ ఉద్యోగం చేశాడు. తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చేలా ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమై తొలిప్రయత్నంలోనే ఏఎంవీఐగా, ఏపీలో నాన్ లోకల్ కోటా కింద ఎస్సైగా, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉద్యోగాలు సాధించడమే కాక గ్రూప్–4లో రాష్ట్రస్థాయి 84, ఖమ్మం జిల్లాలో రెండో ర్యాంక్ సాధించారు. ఆపై పాలిటెక్నిక్ లెక్చరర్‌గానూ ఉద్యోగం సాధించిన మనోహర్ గోపి ఇటీవల మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విధుల్లో చేరాడు.

తల్లిదండ్రులే రోల్ మోడల్..

వెంకట నరసయ్య హోంగార్డ్ ఉద్యోగం చేస్తూనే పొలం పనులకు వెళ్లడం, తల్లి రాధ ఆయనకు సహకరిస్తుండడం.. రోజంతా తల్లిదండ్రులకు కష్టపడుతుండడాన్ని చిన్నతనం నుంచే కళ్లారా చూశామని గోపీకృష్ణ, మనోహర్ గోపి తెలిపారు. అంతేకాక మంచిగా చదివి పెద్ద ఉద్యోగాలు సాధించాలని తల్లిదండ్రులు నింపిన స్ఫూర్తితో కష్టపడడంతోనే ఫలితం వచ్చిందని వెల్లడించారు. ఇక తాత భీమనబోయిన పెద్ద నారాయణ సైతం ఇతరులను ఇబ్బంది పెట్టకుండా కష్టాన్ని నమ్ముకుని పట్టుదలతో పనిచేసే తత్వాన్ని నేర్పించారని గుర్తుచేసుకున్నారు.

దారి చూపిన దేవత.. అమ్మ

గ్రూప్–1 సాధించి తల్లి కోరిక నెరవేర్చిన యువకుడు



తల్లి, సోదరుడితో ప్రమోద్ సాయి

సత్తుపల్లి: తండ్రి చిన్నతనంలోనే కన్నుమూశాడు.. అప్పటి నుంచి అన్నీ తానై పెంచిన తల్లి ప్రజలకు సేవ చేసే ఉద్యోగం సాధించాలని చెబుతుండేది. ఆమె కోరిక మేరకు కష్టపడి చదివిన యువకుడు గ్రూప్–1 ర్యాంకు సాధించాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని తాటి సుబ్బన్నగూడెంకు చెందిన తాటి రామచంద్రరావుకు భార్య సుదర్శనమ్మతో పాటు కుమారులు ప్రమోద్‌సాయి, ప్రదీప్‌చంద్ర ఉన్నారు. పిల్లల చిన్నవయస్సులోనే రామచంద్రరావు మృతి చెందగా తల్లి అన్నీ తానై పెంచి పెద్దచేసింది. ప్రస్తుతం ఆమె సత్తుపల్లి మండలం కాకర్లపల్లి హైస్కూల్‌లో సోషల్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ప్రమోద్ సత్తుపల్లిలోని వీ.వీ.విద్యాలయంలో 10వ తరగతి పూర్తిచేశాక ఇంటర్ అనంతరం హైదరాబాద్‌లోని వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి కాలేజీలో ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. అయితే, సివిల్ సర్వెంట్‌గా ఉద్యోగం సాధించాలని, తద్వారా ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కుతుందన్న తల్లి సూచనలతో ప్రమోద్ సివిల్స్‌కు సిద్ధమయ్యాడు.

ప్రమాదంలో తీవ్రగాయాలు

సివిల్స్‌కు సిద్ధమయ్యే క్రమాన ప్రమోద్‌సాయి ఢిల్లీలోని వాజీరం కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటుండగా 2019లో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆరేళ్ల సమయాన్ని చికిత్స కారణంగా కోల్పోయినా ఆయన ఆత్మవిశ్వాసం చెక్కుచెదరలేదు. తల్లి ప్రోత్సాహంతో ఎలాంటి శిక్షణ తీసుకోకుండా ఇంటి వద్దే సిద్ధమైన ఆయన గ్రూప్–1లో రాష్ట్ర స్థాయిలో 317, ఎస్టీ కేటగిరీ జోన్–1లో 10వ ర్యాంక్ సాధించడం విశేషం. తద్వారా తల్లి కోరికను నెరవేర్చారనని ప్రమోద్ తన ఆనందాన్ని పంచుకున్నాడు.

విద్యార్థి చదువులకు రూ.65,500 ఆర్థికసాయం



విద్యార్థి తల్లికి చెక్ అందిస్తున్న రామారావు

కల్లూరు: కల్లూరుకు చెందిన నిరుపేద విద్యార్థి చింతకాయల నరసింహారావు వరంగల్‌లో బీఎస్సీ నర్సింగ్ చదువుతుండగా, ఫీజు, హాస్టల్ ఇతర ఖర్చులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈవిషయాన్ని స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్‌తో మాట్లాడగా రూ.65,500 చెక్కును మంగళవారం నరసింహారావు తల్లి సీతమ్మకు అందజేశారు. వలంటీర్లు ఉబ్బన బాబూరావు, జల్దా రామకృష్ణ, సిరసాని రామ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘం సొమ్ము పక్కదారి

బ్యాంకులో జమ చేయకుండా వాడుకున్న వ్యక్తి

నేలకొండపల్లి: స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న రుణం చెల్లించే క్రమాన ఆ నగదును మినీ బ్యాంకులో చెల్లిస్తుండగా, సొంతానికి వాడుకున్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. అయితే, పెద్దల సమక్షాన పంచాయితీ నిర్వహించడంతో డబ్బు తిరిగి ఇస్తానన్న వ్యక్తి మాట తప్పడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. నేలకొండపల్లి మండలం చెరువుమాదారం గ్రామానికి చెందిన ఎల్లమ్మ స్వయం సహాయక సంఘం సభ్యులు తీసుకున్న రుణానికి సంబంధించి ప్రతీనెల కిస్తీని స్థానికంగా ఉన్న ఓ మినీ బ్యాంక్ వద్ద చెల్లిస్తున్నారు. ఇటటీవల 29 నెలలు పూర్తవడంతో సభ్యులంతా బ్యాంక్‌కు వెళ్లి ఖాతా పరిశీలించగా ఇంకా రూ.4.80 లక్షల బకాయి ఉందని తేలడంతో మినీ బ్యాంక్ బాధ్యులను నిలదీశారు. ఆపై స్థానిక నాయకుల వద్ద పంచాయితీ నిర్వహ/ ంచగా డబ్బు తిరిగి చెలిస్తానని లిఖితపూర్వకంగా ఒప్పుకున్నాడు. ఆతర్వాత రూ.1.36 లక్షలు బ్యాంకులో చెల్లించి రశీదులు ఇవ్వగా, మిగతా నగదుపై పది రోజుల క్రితం మరోమారు పంచాయితీ నిర్వహించారు. అయినా మంగళవారం నాటికి ఫలితం కానరాక స్వయం సహాయక సంఘం సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, ఐకేపీ అధికారుల పట్టింపులేని తనంలోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి విజయంతో పాదయాత్ర



కొణిజర్లలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళుల పీఆర్‌టీయూ నాయకులు

ఖమ్మంసహకారనగర్/కొణిజర్ల/వైరా: పీఆర్‌టీయూ టీఎస్ నుంచి ఎమ్మెల్సీగా బరిలోకి దిగిన పింగిలి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించిన నేపథ్యాన యూనియన్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు నేతృత్వాన మంగళవారం ఖమ్మం ఇందిరానగర్‌లోని వినాయక స్వామి దేవాలయం నుండి 23మందితో కొణిజర్ల మీదుగా 25 కి.మీ. పాదయాత్ర చేపట్టి వైరాలోని పాత శివాలయానికి చేరుకున్నారు. ఈసందర్భంగా వైరాలోని పాత శివాలయం, రిజర్వాయర్ సమీపంలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీపాల్‌రెడ్డి విజయానికి గుర్తుగా పాదయాత్ర చేపట్టామని తెలిపారు. ఆయన ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ ఉపాధ్యాయులు, విద్యారంగం సమస్యల పరిష్కారానికి పాటుపడతారని చెప్పారు. ఈ యాత్రలో పీఆర్‌టీయూ జిల్లా, మండలాల బాధ్యులు వెలిశెట్టి నరసింహారావు, గోవర్ధన రెడ్డి, డి.సత్యనారాయణ, జాన్, రామచంద్రయ్య, రమేష్, హరిబాబు, శ్రీనివాసరావు, సరిత, రూప, సునీత, సతీష్, వెంకటరమణ, విజయ్ అమృతకుమార్, రత్నకుమార్, సీతారామయ్య, కుసుమ నాగేశ్వరరావు, కె.రాము, పాటి వెంకటేశ్వర్లు, టి.వెంకన్న, కె.గోపాలరావు, గార్లపాటి రామారావు, కే.వీ.నాయుడు, తాత రాఘవయ్య, పి.వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, అనంతోజు పుల్లయ్యాచారి, భిక్షం, రమేష్ పాల్గొనగా.. కాంగ్రెస్ నాయకులు సూరంపల్లి రామారావు, నెల్లూరి రమేష్, చల్లగుండ్ల సురేష్ స్వాగతం పలికారు.

రైలుకింద పడి మృతి

బోనకల్: బోనకల్ రైల్వేస్టేషన్ సమీపాన మంగళవారం రైలు నుంచి కింద పడడంతో గుర్తుతెలియని వ్యక్తి (30) మృతి చెందాడు. ఈమేరకు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు.

తండ్రి తల పగలగొట్టిన కుమారులు

నేలకొండపల్లి: మండలంలోని అనాసాగరానికి చెందిన బి.కొండల్ కుమారులు ఆయన తల పగలగొట్టారు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకోగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయితే, ఇందుకు కారణాలు తెలియాల్సి ఉంది.

ఆర్టీసీ బస్సు - లారీ ఢీ

- చిన్నారి సహా పది మందికి గాయాలు



క్షతగాత్రులను బయటకు తీస్తున్న స్థానికులు



ఆస్పత్రిలో చిన్నారి దేవిక్, వరమ్మ

వైరా: ఆర్టీసీ బస్సు - లారీ ఢీకొన్న ఘటనలో పది మందికి గాయాలయ్యాయి. వైరాలోని రింగ్ రోడ్డు సెంటర్‌లో మంగళవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఖమ్మం నుంచి మణుగూరుకు వెళ్తోంది. వైరా బస్టాండ్‌లో నుండి రింగ్ రోడ్డులోకి తిరుగుతున్న సమయాన తల్లాడ వైపు నుండి ఖమ్మం వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో గుండాల మండలం వేపలగడ్డకు చెందిన వరమ్మ, ఆమె కోడలు భారతి, మనవడు మూడేళ్ల దేవిక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దేవిక్‌కు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఖమ్మం ఆస్పత్రికి వెళ్లివస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వీరికి వైరాలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ఇక కొత్తగూడెం చెందిన రియాజ్, రుద్రంపూర్‌కు చెందిన ప్రేమ్, పాల్వంచకు చెందిన శ్రావ్యకు, తల్లాడకు చెందిన జనార్దన్, భవాని, మోక్షిత్‌కు స్వల్పగాయాలు కావడంతో స్థానికులు బయటకు తీసి చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం

మణుగూరు డిపో ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని.. ఖమ్మం నుంచే వేగంగా, నిర్లక్ష్యంగా నడిపాడని ప్రయాణికులు, స్థానికులు వెల్లడించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఘర్షణ పడుతున్న కాలనీవాసులు

దారి విషయంలో ఘర్షణ

వేంసూరు: దారి వివాదమై ఇరువర్గాలు ఘర్షణ పడిన ఘటన మండలంలోని జయలక్ష్మీపురంలో మంగళవారం చోటు చేసుకుంది. కొంత కాలంగా జయలక్ష్మీపురం ఎస్సీ కాలనీలో దారి విషయమై వివాదం నెలకొంది. దీంతో అప్పటి తహసీల్దార్, సర్వేయర్ హద్దులు నిర్ణయించారు. అయితే, మంగళవారం ఓ వర్గానికి చెందిన వ్యక్తి గతంలో హద్దులు నిర్ణయించిన దారికి ఫెన్సింగ్ వేశాడు. దీంతో ఎస్సీ కాలనీవాసులు అడ్డుకునేందుకు వెళ్లగా కాలనీకే చెందిన ఇరువర్గాల నడుమ ఘర్షణ చోటు చేసుకుంది. రెండు వర్గాల పరస్పరం దాడులకు దిగగా, ఆతర్వాత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.